
ప్రజాశక్తి
మంగళవారం 13 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం



లెవీ సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్‌ను కోరిన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

లెవీ సేకరణలో ఏర్పడే సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కోరారు. లెవీ సేకరణలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌తో కృష్ణదాస్ సోమవారం భేటీ అయ్యారు. ఈ విషయంలో మిల్లులకు వచ్చిన ధాన్యం ఎంత? మిల్లులు పంపిన బియ్యం ఎంత? అనే తదితర వివరాలను మిల్లు యజమానులు పక్కాగా రికార్డులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ-క్రాప్ ఆధారంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ముడిపెట్టడం వల్ల పక్కా ప్రణాళికతో ధాన్యం సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఖరీఫ్ దిగుబడులను సమీకరించే విధంగా రైస్ మిల్లర్లు ధాన్యం లెవీ సేకరణకు సమాయత్తమవుతున్నారని, వారికున్న చిన్నపాటి సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరారు.

'హక్కు' ఎన్నటికి దక్కేనో..!

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంటూ ఏడాది కిందట ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంది. ఒటిఎస్ కింద డబ్బులు చెల్లిస్తే శాశ్వత గృహ నిర్మాణ పథకం కింద రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని తెలిపింది. ఇళ్లు సొంతం కావడంతో బ్యాంకు రుణాలు కూడా పొందవచ్చని ప్రచారం చేసింది. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. డబ్బులు కట్టేందుకు విముఖత చూపారు. ప్రజలు డబ్బులు చెల్లించేలా మంత్రులు, ఎమ్మెల్యేలను రంగంలోకి దించింది. వాలంటీర్లతో ఒత్తిడి చేయించింది. సంక్షేమ పథకాలు సైతం కట్ చేస్తామంటూ ఒకానొక దశలో ప్రచారం చేశారు. దీంతో అయిష్టంగానైనా గృహ యజమానులు డబ్బులు చెల్లించారు. తీరా చూస్తే ఇప్పటివరకు హక్కు పత్రాలు అందించలేదు. ఒటిఎస్ పత్రాల కోసం జనం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

- అసంపూర్ణంగానే ఒటిఎస్
- డబ్బులు చెల్లించినా అందని హక్కు పత్రాలు
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ రుణంతో 1983 నుంచి 2011 ఆగస్టు 15వ తేదీ వరకు నిర్మించిన ఇళ్లకు లబ్ధిదారుల నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారుల నుంచి రూ.20 వేలు, మున్సిపాలిటీల్లోని పేదల నుంచి రూ.15 వేలు, గ్రామీణ ప్రాంత పేదల నుంచి రూ.10 వేలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద జిల్లాలో 1,88,448 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒటిఎస్‌పై జనంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. డబ్బులు అడిగేందుకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో లబ్ధిదారులు చాలాచోట్ల వాగ్వాదాలకు దిగారు. డబ్బులు చెల్లించేందుకు లబ్ధిదారులు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. అర్బన్ ప్రాంతాల్లో మాత్రం కొద్దిమంది లబ్ధిదారులు ముందుకొచ్చారు. బ్యాంకు రుణాలు, ఇతరత్రా అవసరాల కోసం గృహ హక్కు పత్రం అవసరం కావడంతో ఒటిఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో చాలామందికి అసలు పత్రాలే అందించలేదు. సచివాలయాలు, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే పత్రాల జారీలో జాప్యం జరుగుతుందనే వార్తలు వచ్చాయి. ఏడాది గడిచినా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప పత్రాలు అందించడం లేదు.



ఒటిఎస్ పత్రాలను అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి (ఫైల్)

23,594 మందికే రిజిస్ట్రేషన్

ప్రభుత్వం నిర్దేశించిన సంవత్సరాల్లో రుణం తీసుకున్న వారు 1,88,448 మంది ఉన్నట్లు గుర్తించారు ఇందులో ఒటిఎస్ పథకం పరిధిలోకి 43,098 మంది వచ్చినట్లుగా తేల్చారు. వీరిలో 23,594 మందికి రిజిస్ట్రేషన్ చేయించగలిగారు. ఇలా రిజిస్ట్రేషన్ చేసిన వారికి సైతం పూర్తిస్థాయిలో హక్కు పత్రాలు అందించలేకపోయారు.

ఒటిఎస్‌పై ఊసెత్తని ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ ఆదేశాలతో ఒటిఎస్ అంశాన్ని ప్రజాప్రతినిధులే బాధ్యత తీసుకున్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లపై ఒత్తిడి తెచ్చారు. సిబ్బంది ఇళ్లకు వెళ్లి మరీ డబ్బులు కట్టించుకున్నారు. తీరా డబ్బులు కట్టిన తర్వాత ఎవరూ మాట్లాడడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

విశ్వసనీయతే పత్రిక ప్రతిష్ఠకు ప్రామాణికం

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- స్వీయ నియంత్రణ పాటించాలి : మంత్రి అప్పలరాజు
- ప్రజాహిత కథనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విశ్వసనీయతే పత్రిక ప్రతిష్ఠకు ప్రామాణికమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బి.ఆర్ అంబేద్కర్ కళా వేదికలో రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యాన 'జర్నలిజం మౌలిక సూత్రాలు - విలువలు - ప్రమాణాలు' అనే అంశంపై సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒకే వార్త ఒక్కో ఛానల్‌లో ఒక్కో రీతిన వస్తుందని, ఏది నిజమో తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల మీడియాపై జనంలో అపనమ్మకం ఏర్పడే ప్రమాదముందన్నారు. వాస్తవిక దృక్పథం కలిగిన వార్త ప్రచురిస్తేనే విలువలు పెరుగుతాయన్నారు. వార్తలు రాసే క్రమంలో ఒకసారి పరిశీలన చేసుకోవాలన్నారు. జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టాలని, అందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సోషల్ మీడియా నుంచి జర్నలిజం సమస్యలను ఎదుర్కొంటోందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. వాస్తవాలు ప్రజలకు చేరేలా పత్రికలు పనిచేయాలన్నారు. పత్రికలు స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. జర్నలిస్టులు క్రమశిక్షణ పాటిస్తూ నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలన్నారు. జర్నలిజం విలువలు పెంపొందించడంలో ఈ సదస్సు దోహదపడగలదని ఆకాంక్షించారు.

జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించడమే ఏకైక లక్ష్యంగా నాడు పత్రికలు పనిచేశాయని గుర్తు చేశారు. నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని సూచించారు. ప్రెస్ అకాడమీ అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పత్రికలు బాధ్యతాయుతంగా వ్యవహరించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వంపై విద్వేషం, విషం చిమ్మేలా వార్తలు రాయడం సరికాదన్నారు. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల దృష్టితో కాకుండా సామాజిక దృక్పథంతో వార్తలు రాయాలని సూచించారు. జర్నలిజంలో విలువలు పాటించినప్పుడే సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. వార్తా కథనాల్లో నవ్యత, నాణ్యత, ప్రజా ప్రయోజనాల కంటే సంచలనాలే ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన సామాజిక బాధ్యతను మీడియా మరిచిపోరాదని గుర్తుచేశారు. వ్యవస్థలో లోపాలు ఎత్తిచూపాలి తప్ప వ్యక్తిగత, కక్షపూరిత కథనాలు అల్లడానికి ప్రాధాన్యత ఇవ్వరాదన్నారు. సమాజంలో జర్నలిజానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. సామాజిక మాధ్యమాలపై ఆధారపడకుండా వాస్తవాలను తెలుసుకుని వార్తలను రాయాలని సూచించారు.

అంతకుముందు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ జర్నలిస్టులు సి.రాఘవాచారి, గిడుగు రామ్మూర్తి పంతులు, మానుకొండ చలపతిరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. సమావేశానికి హాజరైన జర్నలిస్టులకు సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సులో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల సమాచార పౌర సంబంధాల అధికారులు ఎల్.రమేష్, బాలమాన్‌సింగ్, డాక్టర్ దానేటి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టులు సత్తారు భాస్కరరావు, దుంపల లక్ష్మణరావు, పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

బిఆర్ఎయులో ప్రత్యేక లైబ్రరీ ప్రారంభం

పరిశోధనాత్మక గ్రంథాలు, మీడియా సంబంధిత పుస్తకాలు, రిఫరెన్స్‌లతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలోని జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రంథాలయాన్ని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. జర్నలిజం అధ్యయనకారులు, పాత్రికేయులు ఈ లైబ్రరీని వినియోగించుకోవాలని సూచించారు. నైపుణ్యం, వార్తా రచనపై పట్టు ఉంటే జర్నలిజం రంగంలో యువతకు చక్కని ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ మీడియా సమాజంలో ఒక భాగమేనని గుర్తించి బాధ్యతగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరిజనేతరులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి - ఆమదాలవలస

జిఒ నంబరు 52ను రద్దు చేసి సంప్రదాయ ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఆదివాసీల సాంప్రదాయక నృత్యాలతో స్పీకర్ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ దగ్గర అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టిలను పరిగణించకుండా చూడాలని కోరారు. కొండ కోనల్లో, అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీల సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, రిజర్వేషన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు రక్షణగా ఉండాల్సిన పాలకులు... ఓట్లు, సీట్లు, అధికారం కోసం అన్యాయం చేస్తూ వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని పాలకుల తీరుపై మండిపడ్డారు. 2014, 2019 ఎన్నికల్లో ఆదివాసీలంతా వైసిపికి అండగా నిలబడి ఏడు ఎస్‌టి నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిపిస్తే, ఆదివాసీలకు అన్యాయం చేస్తూ రిటర్న్ గిఫ్ట్ ఇస్తోందని విమర్శించారు. ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి ప్రయత్నం చేస్తే వచ్చే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఆదివాసీ జెఎసి ప్రధాన కార్యదర్శి గురడి అప్పన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇదే కులాలపై జిఒ నంబరు 104 ద్వారా జెసి శర్మ ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని, ఆ నివేదికను నేటికీ ఎందుకు బహిర్గతం చేయడం లేదో తెలపాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వంకల మాధవరావు ర్యాలీకి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆదివాసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆదివాసీలను అడవి నుంచి దూరం చేస్తూ కేంద్రం చట్టాలను తీసుకొచ్చిందని, మరోవైపు ఉన్నత న్యాయస్థానం జిఒ నంబరు 3ను రద్దు చేస్తూ ఆదివాసీలకు అన్యాయం చేసిందన్నారు. ఓట్ల కోసం అగ్ర కులాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని హామీలు ఇవ్వడం సరికాదని, వెంటనే 52 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బూర్జ, సరుబుజ్జిలి మండలాల ఆదివాసీలు, జెఎసి నాయకులు సవర శోభన్, చల్ల లక్ష్మణరావు, గేదెల హరికృష్ణ, బాడంగి సురేష్ దొర తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజనులు

టోల్‌ప్లాజా కార్మికులను సర్దుబాటు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేయాలని, లేకుంటే తగిన పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. టోల్‌ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి జిల్లాపరిషత్ వరకు సోమవారం ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించారు. చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేసి ఇక్కడి ఆదాయాన్ని నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ఈ టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా కార్మికులను రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏవిధంగా బతకాలని ప్రశ్నించారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని యూనియన్‌కు, నేషనల్ హైవే అధికారులతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ధర్నాలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటరమణ, డి.వి నర్సింహులు, ఎం.శంకరనారాయణ, ఎ.వి.ఆర్‌మూర్తి, బి.రాజేశ్వర రావు, పి.రాము, జి.వి చిన్నోడు పాల్గొన్నారు.



ప్రదర్శనగా వెళ్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

ధాన్యం కొనుగోలు చేపట్టాలి

- కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి
- 'స్పందన'లో 198 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వరి కోతలు పూర్తయినా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని, సత్వరమే కొనుగోళ్లను ప్రారంభించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గార మండలం రామచంద్రాపురానికి చెందిన రైతులు కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 198 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినతులను స్వీకరించారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేపట్టిన చోట తేమ అధికంగా ఉందంటూ రైతులకు మద్దతు ధర చెల్లించడం లేదని చెప్పారు. ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను ఆ నియోజకవర్గంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో కలపాలని అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. జి.సిగడాం, బూర్జ మండలాలను వేరే నియోజకవర్గాల పరిధిలోని ప్రాజెక్టుల్లో కలపడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని మెట్ట ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు వినతిని అందించారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో సుమారు 800 ఎకరాల్లో టమోటా, 650 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారని వివరించారు. టమోటా కిలో రూ.రెండుకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని, మార్కెట్‌లో మాత్రం రూ.20 నుంచి 25 ధర పలుకుతున్నా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. శాంతిభద్రతలపై దృష్టిసారించి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని గార మండలం రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపిటిసి ఆర్.శ్రీనివాసరావు కోరారు. గ్రామానికి సంబంధం లేని కొందరు వ్యక్తులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. గ్రామస్తుల ఇళ్లు, ఇళ్ల స్థలాల పైకి వచ్చి అల్లర్లు సృష్టిస్తున్నారని తెలిపారు. దీనిపై గార పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం

స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసినప్పుడే జిల్లా పురోగతి సాధిస్తుందని పిలుపునిచ్చారు. స్పందన అర్జీలు పెండింగ్‌లో లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకున్న అధికారులను అభినందిస్తూనే, ఇదే స్ఫూర్తితో మున్ముందుకూడా ఎటువంటి దరఖాస్తులు పెండింగు లేకుండా చూడాలన్నారు. అధికారులంతా సమిష్టి కృషితో ఏదైనా సాధిస్తామన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. పరిష్కారంలో నాణ్యత, కచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరారు. ఆ సమాచారంపై అర్జీదారులు సంతృప్తిని వ్యక్తం చేయాలని సూచించారు. అర్జీదారుల ఫొటోలను కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని, ఫొటోలు క్లియర్‌గా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎపి పోర్టల్ సర్వీసెస్‌లో అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు డి.వి విద్యాసాగర్, జి.వి చిట్టిరాజు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎం.త్రినాథరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రిన్సిపాల్‌పై తొలి రోజు విచారణ పూర్తి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎంక్వయిరీ కమిటీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖపై తొలి రోజు విచారణ సోమవారం పూర్తయింది. కళాశాల అధ్యాపకులు, యూనివర్సిటీ అధికారుల ఫిర్యాదు నేపథ్యంలో కళాశాల విద్యా విభాగం (గుంటూరు) నుంచి ఉన్నత విచారణ కమిటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించింది. ప్రిన్సిపాల్ సురేఖపై వచ్చిన ఆరోపణలన్నింటిపై రూపొందించిన ప్రశ్నావళిని విచారణ అధికారులు తమ వెంట తెచ్చినట్లు తెలిసింది. అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని గదుల్లో వేర్వేరుగా కూర్చోపెట్టి రాయించినట్లు సమాచారం. ప్రిన్సిపల్ సురేఖపై వచ్చిన ఆరోపణలు, అధ్యాపకులపై వేధింపులకు సంబంధించిన ప్రశ్నలు పొందుపరుస్తూ నిజమా? కాదా? అని తెలపమన్నట్లు తెలిసింది. ఇందులో అధ్యాపకులను స్పాట్ వాల్యూయేషన్‌కు పంపేందుకు నిరాకరించడం, విద్యార్థితో పరీక్షా పత్రాలను దిద్దించడం, అధ్యాపకులకు సెలవులు మంజూరు చేయకపోవడం వంటి ప్రశ్నలు ఉన్నట్లు తెలిసింది. ప్రశ్నాపత్రానికి జవాబులు రాసిన తర్వాత ఎవరికైనా ఇంకేమైనా సమస్యలు ఉంటే వ్యక్తిగతంగా కలవచ్చని విచారణ కమిటీ సభ్యులు సూచించినట్లు సమాచారం. అంతకంటే ముందు విచారణ కమిటీ సభ్యులు ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి వెళ్లినట్లు తెలిసింది.

అక్కడ తొలుత విచారణ చేపట్టి అనంతరం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చినట్లు సమాచారం. మంగళవారం మరోసారి విచారణ చేయవచ్చని అధ్యాపకులు, సిబ్బంది చర్చించుకుంటున్నారు. విచారణ కమిటీలో కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ అధికారి తులసీ మస్తానమ్మ, డిప్యూటీ డైరెక్టర్ శంకరరావు, ఆర్‌జెడి కృష్ణ ఉన్నారు.

కంబిరిగాం భూ సమస్య పరిష్కారం

- రైతులకు 13.55 ఎకరాలు
- ప్రజా పంచాయతీలో స్పష్టం చేసిన చౌదరి

ప్రజాశక్తి - పలాస

కంబిరిగాం భూ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. మండలంలోని కంబిరిగాంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో కంబిరిగాం భూ సమస్యపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 13.33 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చేస్తున్నట్లు దువ్వాడ వెంకటరావు చౌదరి ప్రజా పంచాయతీలో సోమవారం స్పష్టం చేశారు. కంబిరిగాం భూస్వాముల ఆధీనంలో 254 ఎకరాలు ఉండగా అందులో 194.65 ఎకరాలు రైతుల సాగులో ఉండేవి.. ఇనాం యాక్ట్ కింద భూస్వామికి 64 ఎకరాలు, రైతులకు 129.76 ఎకరాలు చొప్పున అధికారులు గతంలో పంపిణీ చేశారు. అయితే ఆ భూముల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఏడు నెలలుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కమిటీ సభ్యులపైనా ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రజా పంచాయతీలో వెంకటరావు చౌదరి మాట్లాడుతూ. కమిటీ సభ్యులపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదని అన్నారు. భూ సమస్య రాజీ సమయంలో రైతులు తనకు 20 ఎకరాలు ఇచ్చారని చెప్పారు. ఇటీవల కొంత మంది రైతులు భూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని, దానికి బాధపడుతూ భూములిచ్చిన రైతులందరూ 13.55 ఎకరాలను సమానంగా పంచుకోవాలని ప్రజా పంచాయతీలో తెలిపారు. దీన్ని మండల ప్రజా వేదిక ముక్తకంఠంతో తీర్మానించారు. ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు చేసిన ఫిర్యాదులను ఉపసంహరించుకునేందుకు రైతులు అంగీకరించారు. సమావేశంలో భూస్వామి కుమారుడు దువ్వాడ రామనందేశం చౌదరి, సర్పంచ్‌లు బోడసింగి ధనుంజయ, సైని దేశయ్య, తామడ మదన్, వరిశ రామారావు, గాలి కృష్ణారావు, కోరాడ ధనరాజ్, మార్పు బైరాగి, అంబటి కృష్ణమూర్తి, వడ్డీ యాదగిరి, మాజీ ఎంపిటిసి గరుగు సింహాచలం, కొవ్వూరు బైరాగి, కంబిరిగాం, ఈదురాపల్లి, కేదారిపురం రైతులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వెంకటరావు చౌదరి

పింఛన్ కోసం వచ్చి.. ప్రాణాపాయ స్థితిలోకి

రక్తం ఎక్కించి కాపాడిన ప్రభుత్వ వైద్యులు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని పాతవరక గ్రామానికి చెందిన శ్రీను పురియా, రాణి పురియాలది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. హైదరాబాద్‌లో ఉంటూ జీవనోపాధి పొందుతున్నారు. వీరి నాలుగేళ్ల కుమారుడు ప్రవీణ్‌కుమార్ తలసేమియాతో బాధపడుతున్నాడు. అక్కడే రక్తం ఎక్కిస్తున్నారు. తమ కుమారుని వైద్యం కోసం ప్రతి నెలా రూ.6వేలకుపైగా ఖర్చు చేస్తున్నారు. ప్రవీణ్‌కుమార్‌కు పెన్షన్ కోసం 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. పెన్షన్ రాకపోవడానికి గల కారణాలు తెలుసుకునేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారు. ఈలోగా సోమవారం ఉదయం ప్రవీణ్ కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించింది. తక్షణమే రక్తం ఎక్కించకపోతే బిడ్డ ప్రాణానికే ప్రమాదం ఏర్పడింది. కవిటి మండలంలో అంత రక్త నిల్వలు లేవు. ఈ విషయం కవిటి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రామ్‌జీ, డాక్టర్ మౌనికకు తెలియడంతో టెక్నీషియన్ పాపారావు సహకారంతో అప్పటికప్పుడు ప్రవీణ్‌కు రక్తం తెప్పించి, ఎక్కించారు. దీంతో ప్రవీణ్‌కుమార్ ప్రాణాపాయస్థితి నుంచి తప్పించుకున్నాడు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో స్పందించి పసివాడికి రక్తం అందించిన వైద్య సిబ్బందికి ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యులు, స్థానికులు అభినందించారు. తమ పరిస్థితిని గుర్తించి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తమ బిడ్డకు పింఛన్ మంజూరు చేయాలని ప్రవీణ్ కుమార్ తల్లిదండ్రులు కోరారు.



ప్రవీణ్‌కు రక్తం ఎక్కిస్తున్న కవిటి ప్రభుత్వ వైద్య సిబ్బంది


నియామకపు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

15 మందికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో, ఇతర కారణాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టారు. అందులో భాగంగా రోస్టర్ ఆధారంగా 15 మందికి జెడ్‌పిలో సోమవారం కారుణ్య నియామకపు పత్రాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం.నవీన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వశాఖల్లో చేపట్టిన నియామకాల ఆధారంగా కష్టపడి పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ నియామకాల్లో ఎవరికి ఎటువంటి లంచాలు చెల్లించనవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీని అందుకుంటున్న కిషోర్

మిస్టర్ ఆంధ్రా ఛాంపియన్ షిప్ విజేత కిషోర్

ఆమదాలవలస : మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్-2022 ఛాంపియన్ షిప్‌ను మన్యం పార్వతీపురం జిల్లాకు చెందిన డి.కిషోర్ కైవసం చేసుకున్నట్లు ఎయు జిమ్ అధినేత పాండ్రంకి తారక్ తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్రంలోని 250 మంది బాడీబిల్డర్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఛాంపియన్ ఆఫ్ దికు రూ.30 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. బెస్ట్ మజిల్ విజేతకు రూ.పది వేలు నగదును అందజేశారు. అలాగే ప్రతి గ్రూపుకూ మెమెంటోలు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. బాడీబిల్డింగ్ పోటీలకు సహకరించిన దాతలకు తారక్, జగన్, శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలో క్రీడాకారుల ఎంపిక

ఇచ్ఛాపురం: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం త్రినాథరావు సమక్షంలో అభినందనసభ జరిగింది. ఈ పోటీల్లో ఎంపికైన స్విమ్మింగ్ క్రీడాకారులకు హెచ్‌ఎం అభినందనలు తెలియజేశారు. అండర్-14 విభాగంలో మనోజ్ బెహరా, బస్వాన్ ప్రసాద్‌బెహరా, అండర్-17 విభాగంలో అనిల్‌కుమార్ బెహరా విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో శివరాంపాడి, సూర్యం, జోగేష్, కె.పద్మజ, ఎస్‌ఎంసి చైర్మన్ కె.భీష్మ, పిఇటిలు శారద, గణేష్, స్విమ్మింగ్ కోచ్ బత్తుల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బోరుభద్ర పిఎంసి ఎన్నికల్లో హైడ్రామా

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక హైడ్రామా మధ్య నాలుగోసారి సోమవారం వాయిదా పడింది. బోరుభద్ర జెడ్‌పి ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పదవి కోసం తరగతులకు చెందిన ముద్దపు రమణమూర్తి, పట్నాన శ్రీకాంత్ పోటీపడ్డారు. టిడిపి నుండి వైసిపిలోకి వచ్చిన శ్రీకాంత్‌కు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మద్దతు పలికారు. అయితే గతంలో చైర్మన్ ఎన్నిక పోటీలో ముద్దపు రమణమూర్తి ఉండటంతో కోరంలేక మూడు సార్లు ఎన్నిక వాయిదా పడింది. మళ్లీ సోమవారం ఎన్నిక జరపాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం బోరుభద్రలో జరిగిన వైసిపి మండల కార్యకర్తల విస్తృత సమావేశంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తున్న శ్రీకాంత్ ఆధ్వర్యంలో 75 వైశ్య కుటుంబాలు వైసిపిలో చేరాయి. దీంతో దువ్వాడ రమణమూర్తికి నచ్చజెప్పి, శ్రీకాంత్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. సోమవారం జరిగిన ఎన్నికలకు మండలంలోని వైసిపి ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాఠశాల వద్ద పెద్ద ఎత్తున మోహరించారు. ఇక ఎన్నికల్లో ప్రతి తరగతి చదువుతున్న మొత్తం విద్యార్థుల్లో యాభై శాతం విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6వ తరగతిలో 21

నాలుగో సారి వాయిదా

మందికి ముగ్గురులో, 7వ తరగతిలో 43 మందికి ఐదుగురు, 8వ తరగతిలో 79 మందికి 17 మంది, 9వ తరగతిలో వంద మందికి 15 మంది, పదో తరగతిలో 138 మందికి 28 మంది విద్యార్థుల తల్లిదండ్రులే హాజరయ్యారు. ఏ తరగతిలోనూ మొత్తం హాజరులో 50శాతంలోపే హాజరు ఉండటంతో కోరం లేక హెచ్‌ఎం టి.వి.రమణమూర్తి ఎన్నిక నిర్వహించలేమని తేల్చిచెప్పారు. అయితే ఆయనపై వైసిపి మండల నాయకులు ఒత్తిడి తెచ్చి ఎన్నిక నిర్వహించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుకు భయపడే హెచ్‌ఎం ఎన్నికలు నిర్వహించడం లేదని వైసిపి నాయకులు నినాదాలు చేశారు. తల్లిదండ్రుల కమిటీ ఎన్నికకు తల్లిదండ్రులకు హెచ్‌ఎం నోటీసు ఇవ్వకుండా బోర్డుపై రాసి, విద్యార్థులతో నోటీసులు కావాలనే రాయించి, ఎన్నిక వాయిదా వేయాలని వైసిపి మండల అధ్యక్షులు కోత సతీష్, ఎంపిపి ప్రతినిధి మెండు అప్పారావు ఆరోపించారు. హైడ్రామా నడుమ సభ్యులు కోరం కారణంగా ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు హెచ్‌ఎం ప్రకటించారు. టెక్కలి సిఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో సంతబొమ్మాళి ఎస్ఐ మధుసూధనరావు, నందిగాం, కోటబొమ్మాళి, టెక్కలి ఎస్ఐల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


పొందూరు : ఎన్నికైన కమిటీ సభ్యులతో టిడిపి నాయకులు

ప్రశాంతంగా పిఎంసి ఎన్నికలు

పొందూరు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ (పిఎంసి) ఎన్నికలు ఎంఇఒ పి.వి.రామరాజు, ఎంఇఒ-2 గురుగుబెల్లి శ్యామలరావు అధ్యక్షతన ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 14 పాఠశాలలకు జరిగిన ఎన్నికల్లో అలామాజీపేట, పెనుబర్తి, పుల్లాజీపేట, సింగూరు, తాడివలస, తోలాపి ప్రాథమిక పాఠశాలలు, మొదలవలస ప్రాథమికోన్నత పాఠశాల, తోలాపి, తాడివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, ఎపి మోడల్ స్కూల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కాగా, గోరింట, తుంగొపేట ప్రాథమిక పాఠశాలలు, కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల, లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు అవసరమైన కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఎపి మోడల్ స్కూల్‌లో చైర్మన్‌గా వి.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా పి.ఆదిలక్ష్మి, తాడివలస జెడ్‌పిహెచ్‌ఎస్ చైర్మన్‌గా బి.ప్రసాదరావు, వైస్ చైర్మన్‌గా ఎం.లక్ష్మి, తోలాపి జెడ్‌పిహెచ్‌ఎస్ చైర్మన్‌గా పి.కుసుమ, జి.కవిత, మొదలవలస ఎంపియుపిఎస్ చైర్మన్‌గా ఆర్.లక్ష్మి, పి.కాంచనమాల, అలమాజీపేట చైర్మన్‌గా బి.రాజు, వైస్ చైర్మన్‌గా బి.సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా టి.అమ్మాజీ, వైస్ చైర్మన్‌గా ఎస్.అనూష, సింగూరు చైర్మన్‌గా బి.కృష్ణవేణి, తాడివలస టి.దివ్య, పుల్లాజీపేట చైర్మన్‌గా కె.త్రినాథ, వైస్ చైర్మన్‌గా ఆర్.లక్ష్మి, తోలాపి చైర్మన్‌గా ఎన్.పావని, వైస్ చైర్మన్‌గా వి.నాగభూషణరావు, పెనుబర్తి చైర్మన్‌గా ఎస్.సుశన్న, వైస్ చైర్మన్‌గా ఐ.శ్రీరామమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల పరిశీలకులు ప్రమాణస్వీకారం చేయించారు.

రామ్మోహనరావు అభినందనలు

మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. టిడిపి నాయకుల సహకారంతో చైర్మన్‌గా వావిలపల్లి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మెన్‌గా పిసిని ఆధిలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతూ పాఠశాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు అన్నెపు రాము, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరి, సువ్వారి మధు, బొడ్డేపల్లి సత్యం, కొంచాడ రమేష్‌బాబు, సువ్వారి రమణ, పైడి రాంబాబు ఉన్నారు.


సంతబొమ్మాళి: నోటీసులు ఇవ్వకుండా విద్యార్థులు రాసిన పేపర్లను చూపిస్తున్న వైసిపి నాయకులు

కొత్తకుంకాం పాఠశాల కమిటీ చైర్మన్‌గా భవాని

లావేరు : మండలంలోని కొత్తకుంకాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికల్లో టిడిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. గతంలో పలుమార్లు కోరం లేక వాయిదా పడుతూ వచ్చింది. సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో మాజీ సర్పంచ్ కోలపల్లి దామోదరరావు గ్రూపునకు చెందిన లంకలపల్లి భవాని చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా పెంట లక్ష్మణరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు వీరితో పాటు మరో 13 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో పరిశీలకులుగా జిల్లా అధికారులు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు పాలవలస దివాకర్ పాత్రో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లావేరు : ఎన్నికైన కమిటీ సభ్యులు

అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండరాదు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రజల అర్జీలు పరిష్కరించడంలో జాప్యం ఉండరాదని, అర్జీలపై సత్వరం స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జిల్లా అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావుతో కలిసి 34 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను సోమవారం స్వీకరించారు. క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కుటుంబ తగాదాలు నాలుగు, మోసపూరితమైనవి ఒకటి, సివిల్ తగాదాలు పది, ఇతరత కారణాలు 16, పాత అర్జీలు మూడు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెంటనే ఎస్‌పి కార్యాలయానికి అందజేయాలన్నారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎస్‌ఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన కళాశాల ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.50 లక్షల వ్యయంతో ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దామోదరం, మురళీకృష్ణ, రవికుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న సూర శ్రీను

ఉద్యోగాల పేరుతో టోకరా

ప్రజాశక్తి- కొత్తూరు

రైల్వేలో గ్రూప్-డి పోస్టులు ఇప్పిస్తామని దళారుల మాయమాటలు నమ్మి డబ్బులు అందజేసిన మోసపోయిన ఘటనపై మండలంలోని కడుమకు చెందిన బురాడా చక్రధర ఫిర్యాదు చేశారని ఎస్ఐ ఎం.గోవింద్ సోమవారం తెలిపారు. ఎస్ఐ, బాధితుడి కథనం మేరకు... చక్రధర్ విశాఖపట్నంలో ఓ ప్రయివేటు కంపెనీలో 2016 నుంచి ఉద్యోగం చేస్తున్నారు. ఆ సమయంలో కాకినాడకు చెందిన వీర ఉషారాణి అలియాస్ వుదీనా ఠాగూర్, పుక్కల్లా అమీన్ లవకుమార్ అలియాస్ రాఖీలతో పరిచయం ఏర్పడింది. రైల్వేలో గ్రూప్-డిలో పోస్టులు ఇప్పిస్తామని దళారులు చక్రధర్‌కు మాయమాటలు చెప్పారు. దీనిని చక్రధర్ నమ్మి అదే గ్రామానికి చెందిన తన స్నేహితులైన కొవ్వాడ ఢిల్లేశ్వరరావు, కొవ్వాడ పవన్, బూరాడ నాగరాజుల నుంచి పలు దఫాలుగా ఫోన్ పే, అకౌంట్, నగదు మొత్తం కలిసి రూ.21 లక్షలు దళారులకు అందజేశారు. దళారులు నలుగురికీ అపాయిమెంట్ ఆర్డర్లను అందజేశారు. వాటిని పట్టుకుని కలకత్తాలోని డిఎంఆర్ కార్యాలయానికి వెళ్లి రైల్వే అధికారులకు అందజేశారు. రైల్వే అధికారులు ఆర్డర్లను పరిశీలించి ఇవి నకిలీ అని తేల్చి చెప్పారు. దీంతో మోసపోయామని గ్రహించి చక్రధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతన సవరణ చేసే వరకు పోరాటం


బూర్జ : ఆందోళన చేస్తున్న రైస్ మిల్లు కార్మికులు

ప్రజాశక్తి- మందస

మండలంలోని ఆర్‌కె.పురం, మందసలోని రైస్ మిల్లు కార్మికులకు వేతన సరవణ చేసే వరకు పోరాటం చేస్తామని సిఐటియు మండల కన్వీనరు కె.కేశవరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి బి.దుర్యోధన, కె.బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆర్‌కె.పురంలోని రైస్ మిల్లు ఆవరణలో కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష సోమవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి వేతన సవరణ చేయాల్సి ఉందన్నారు. నేటికి తొమ్మిది నెలలు కావస్తున్నా యాజమాన్యాలు చర్చలకు సహకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, డిఎ, బోనస్ వంటి సదుపాయాలను యాజమాన్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కార్మిక సంఘం నాయకులు పి.కూర్మారావు, ఆర్.ఏకాశీ, ఎం.ధర్మారావు, తులసీరావు, ఎన్.లచ్చయ్య, బి.వెంకటేశం, జయరామ్, బౌందేవు, బి.లచ్చయ్య, బి.పోలయ్య, రైస్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

విఆర్‌ఒల ఆందోళన


బూర్జ : ఆందోళన చేస్తున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి- బూర్జ

కొన్నేళ్లుగా పేరుకుపోయిన విఆర్‌ఒల సమస్యలను తక్షణమే చెల్లించాలని విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు వంజరాపు రమేష్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని ఒత్తిడి కారణంగా మృతి చెందిన విఆర్‌ఒల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అలాగే కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం తహశీల్దార్ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంచిలి: విధి నిర్వహణలో తామంతా తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని, ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని విఆర్‌ఒలు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ హైమావతికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గించడంతోపాటు సెలవు రోజులను ఉపయోగించుకునేలా చూడాలన్నారు. రీసర్వే బిల్లులను వెంటనే చెల్లించాలని, గ్రేడ్-2 విఆర్‌ఒలను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: పని ఒత్తిడి తగ్గించాలని తహశీల్దార్ ఎం.సుధారానికి విఆర్‌ఒలు సోమవారం వినతిపత్రం అందించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పి.యుగంధర్, బి.తారకేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఆరంగి మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయ

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు జరిపేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాథం, సర్పంచ్ నగిరి ప్రభావతి, సిఎస్‌డిటి కూర్మారావు, నాయకులు వెంకటరమణ, పి.కామేష్, మద్దు రాజారావు, సిఇఒ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

శ్రీకాకుళం: ఏలూరులో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలో పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లా ఖ్యాతిని పెంపొందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆకాంక్షించారు. ఈ నెలలో 11,12 తేదీల్లో ఏలూరులో 2022 స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ విభాగాలు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి జాతీయ స్థాయిలో నిర్వహించనున్న స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి కార్యాలయంలోని ఎస్‌పి జి.ఆర్.రాధికను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ధనుష్య దరహాస్, నవ్యశ్రీ, ప్రీతమ్, ఎస్.సాయి తనూజ నాయుడు, అబ్దుల్ ఇమ్రాన్‌లతోపాటు


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పోర్చుగల్ దేశంలో నిర్వహించనున్న స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న రోహన్ శ్రీవత్సవా, తిరుపతిలో జరిగిన స్వాప్ మీట్‌లో శ్యాంసన్, శేసింక్ జోనల్ మీట్‌లో పురుందరిలను అభినందించారు. ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరికాప్రసాద్, కోచ్ మురళీధర్, అంతర్జాతీయ స్విమ్మర్ ఎస్.కాంతారావు పాల్గొన్నారు.

ఇరపాడు నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారం తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగరాపు సింహాచలం, సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మెట్టూరు బిట్-3 సచివాలయం వద్ద ఇరపాడు నిర్వాసితులతో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకునిగా ఉన్న సమయంలో బ్యారేజీ సెంటర్ వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి అధికారంలోకి వచ్చిన వెంటనే 2013 భూసేకరణ చట్టం వర్తింపజేసి పరిహారం చెల్లిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. అనంతరం అదనపు పరిహారం కొద్ది మందికే ఇచ్చారని, మిగతా వారికి అందజేయాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల మద్దతుతో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో రమణమ్మ, షర్మిల, సౌందర్య, సావిత్రి, రాజేష్, సరసమ్మ, లక్ష్మి, అప్పన్న, గోవింద, త్రినాథరావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు


మందులు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

లొద్దపుట్టిలో వైద్యశిబిరం

ఇచ్ఛాపురం: మండలంలోని లొద్దపుట్టిలో సోమవారం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన పైల హరీష్ తన కుమారుడు భరత్ పుట్టిన రోజు సందర్భంగా ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా ఇటువంటి వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యులు 227 మందికి విద్యా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు డాక్టర్ స్వారుప,డాక్టర్ శ్రీజ. వైద్య సిబ్బంది సంతోష, శ్రీధర్, టిడిపి నేతలు దక్కత ఢిల్లీరావు, ఎస్ సహదేవు, డి. కామేశ్వరరావు, బి.ప్రసాద్, ఎ ఈశ్వరరావు,రాంబాబు, పి. పరసరాం,పి దుర్యోధన, ఎ. రామకష్ణ,డి. సారధి రెడ్డి ,ఎ.కష్ణ,బోర గురుమూర్తి,గ్రామ మహిళలు, యువత, పెద్దలు,పాల్గున్నారు.

నేడు వాహనాల వేలం

ఆమదాలవలస : అక్రమ మద్యం దాడుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఇబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు నిబంధనల ప్రకారం రూ.వెయ్యి ఫీజు కట్టి ఆధార్ కార్డుతో పాల్గొవాలని తెలిపారు.


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రకాష్

ఎంఎబి మండల అధ్యక్షులుగా కృష్ణారెడ్డి

ప్రజాశక్తి- కవిటి

మండల వ్యవసాయ సలహా సంఘం(ఎఎబి) అధ్యక్షుడుగా నెలవంక మాజీ సర్పంచ్ దువ్వు కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జెడి శ్రీధర్ నుంచి సోమవారం తనకు నియామక పత్రాలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రైతుగా, ప్రజా ప్రతినిధిగా రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం, అభిమానంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన జెడ్‌పి చైర్‌పర్సన్ విజయకు, ఎంపిపి కె.పద్మకు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త సేకరణపై అవగాహన

ఇచ్ఛాపురం: క్లీన్ ఆంధ్రప్రదేశ్ వారోత్సవాల్లో భాగంగా కౌన్సిలర్ల సమక్షంలో సోమవారం ఇంటింటికీ చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. 13వ వార్డులో చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, 16వ వార్డులో వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ, శానిటేషన్ సెక్రటరీలతో కలిసి వార్డులో ప్రతి గడపకూ వెళ్లి, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న డస్ట్ బిన్‌లను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, మెప్మా సిఒలు బాలరాజు, సంతోష్, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, ఆశ, వాలంటీర్లు పాల్గొన్నారు.

కళాకారులకు నాట్య నటరాజ అవార్డులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం కళాకారులు నాట్య నటరాజ అవార్డులు అందుకున్నారు. శ్రీ శైలంలో శ్రీ వాగ్దేవి వాద్య సంగీతకళ నృత్య సాంస్కృతి సంస్థ అధ్వర్యంలో శ్రీశైల భ్రమరాంబిక, మల్లికార్జున స్వామికి నృత్య పుష్పాంజలి నిర్వహించారు. కళాకారులు సోలో ప్రదర్శనలు చేశారు. దశావతారం రామాయణ శబ్దం, వినరొభాగ్యం, బాలగోపాల, తరంగం పాటలకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాళాకారులకు అవార్డులు ఇచ్చి, అభినందించారు. నాట్య గురువు మంగి దివ్య, కర్ణం కుమార్, బత్తిన నాయని, బాగ భవానీ, పాలెపు వర్షిత, తోట ఉషారాణి అవార్డులు అందుకున్నారు. వీరికి బి.నాగేంద్ర అవార్డులు అందించారు. వీరిని అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న కళాకారులు

అంతర్జాతీయ విద్య అందించడం అభినందనీయం


స్వామినాయుడును సన్మానిస్తున్న 'ఎన్ఇఆర్'

రణస్థలం రూరల్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటు లో ఉండేలా ఈ ప్రాంతంలో విద్యా సంస్థను స్థాపించి ఇంటర్నేషనల్ విద్య అందించడం అభినందనీయమని శ్రీకాకుళంలోని గురజాడ విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకు దిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అతి తక్కువ సమయంలోనే ఇంటర్నేషనల్ స్టాండర్స్ కలిగిన విద్యా సంస్థగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం శుభపరిణామమన్నారు. ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్‌లో అడ్వాన్స్ టీచింగ్ విధానం, ఆహ్లాదకరమైన క్రీడా ప్రాంగణం, స్కూల్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావుకు అభినందనలు తెలియజేశారు. పిన్న వయసులోనే ఇంతటి విద్యాసంస్థను ప్రతిష్టాత్మకంగా నడిపిస్తున్న స్కూల్ కరస్పాండంట్ ఎన్.తేజను అభినందించారు. అనంతరం స్వామినాయుడును ఎన్ఇఆర్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఆయనతో పాటు దుర్గాప్రసాద్, ఎన్ఇఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు రామకృష్ణ ఉన్నారు.

వసతిగృహం తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని చిన్నమురపాకలో ఉన్న బిసి బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం రాత్రి ఆస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో అందిస్తున్న మోనూను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఆదివారం అందించిన ఆహారంపై కుక్కు, వసతిగృహ సంక్షేమాధికారి దాసును అడగగా, చికెన్ పెట్టామని తెలిపారు. వెంటనే విద్యార్థులను అడగగా దొండకాయ కూర పెట్టారని తెలియజేయడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతిగృహంలో మోనూ ప్రకారం ఆహారం అందించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఒకవైపు చెబుతున్నా వసతిగృహాల్లో ఇలా చేయడం తగదని హెచ్చరించారు. వసతిగృహ సంక్షేమాధికారిపై చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో జిల్లా బిసి సంక్షేమాధికారిణి అనురాధకు తెలియజేశారు. అనంతరం చిన్నమురపాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, సర్పంచ్ మీసాల పార్వతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవాలకు సరిపడా మందులు ఇవ్వాలి

ప్రజాశక్తి- నందిగాం

జిల్లాలో గొర్రెలు, మేకలు 10 లక్షల వరకు ఉన్నాయని, కానీ ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న మందులు సరిపోవడం లేదని గొర్రెలు, మేకల పెంపకం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్ర విడిపోవడం వల్ల వ్యాక్సినేషన్., నత్తల నివారణ మందులు సక్రమంగా అందడం లేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పెంపకందారులకు ఇన్సురెన్స్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంపకందారులకు వృద్ధాప్య పింఛను ఇవ్వాలని, గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

కృష్ణదాస్ పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార మండలం శ్రీకూర్మంలో ఇటీవల హత్యకు గురైన బరాటం రామశేషు ఉదంతం దిగ్భ్రాంతికి గురి చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు రామశేషు కుటుంబాన్ని శ్రీకూర్మంలోనినివాస స్వగృహంలో సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు ఉన్న నాయకుడిని గుర్తించి పొందిన రామశేషు ఇలా హత్యకు గురి కావడం దురదృష్టకరమన్నారు. ఆయనతో పాటు డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, సుడా చైర్పర్సన్ ప్రతినిధి కోరాడ చంద్రమోహన్ గుప్తా, పోలాకి ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, గార ఎంపిపి గొండు రఘురాం, గొండు కృష్ణమూర్తి, తంగి మురళీకృష్ణ, రాజాపు అప్పన్న పాల్గొన్నారు.

'ఉత్సవ విగ్రహాలుగా కార్పొరేషన్లు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పి.ఎం.జె.బాబు

జగన్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన బిసి, ఎస్సి కార్పొరేషన్లు కేవలం ఉత్సవ విగ్రహాలుగానే ఉన్నాయని, నిధులు ఇవ్వకుండా చైర్మన్లు, డైరెక్టర్లకు జీతాలు ఇవ్వడానికి కేవలం ట్రెజరీగా ఉపయోగపడుతున్నాయని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు ధ్వజమెత్తారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తరగతుల సంక్షేమ కార్పొరేషన్ల బోర్డులకే పరిమితం చేశారన్నారు. హంగు, ఆర్భాటం, ప్రచారానికి, దుబారా ఖర్చులు తప్ప ఒక్క తరగతికి ఈ కార్పొరేషన్ల ద్వారా సంక్షేమ పథకాలు గాని, రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దళితుల సంక్షేమ పథకాలను అందించేందుకు వీలుగా గతంలో ఏర్పాటు చేసిన ఎస్సి కార్పొరేషన్లను మూడు ముక్కలు చేశారన్నారు. బిసిల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఈ మూడేళ్ల కాలంలో ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం హయాంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు రద్దు చేశారని, వాటి స్థానంలో ఒక్క సంక్షేమ పథకమూ కొత్తగా తీసుకురాలేదని విమర్శించారు. తక్షణమే కార్పొరేషన్లకు నిధులు కేటాయించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.

సమన్వయంతో సత్ఫలితాలు సాధ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేస్తే సత్ఫలితాలు సాధ్యపడతాయని మండల విద్య, సంక్షేమ అధికారి, ఎంఎఒ పైడి కూర్మారావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. పదకొండవ షెడ్యూల్లో చేర్చిన 29 అంశాలపై సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్న బాధ్యత గ్రామ పంచాయతీలదే అని తెలిపారు. మహిళలకు వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, జీవనోపాధులు మెరుగుపరుచుకోవడానికి స్త్రీనిధి ద్వారా రుణాలు అందించి పాడిల్స్, పెరటి కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తుల మెరుగుపరుచుకునేందుకు జగనన్న పాలవెల్లువ వంటి పథకాలు అమలు చేస్తుందన్నారు. పిల్లల చదువు కోసం డ్రాప్ అవుట్స్ లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని అమలుచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎంపిడిఒ ఎం.రేణుక, మండల పరిషత్ పరిపాలన అధికారి వాసుదేవరావు, ఎంపిటిసిలు, సర్పంచ్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూర్మారావు

ప్రజా సంక్షేమ సమతుల్యానికే 'గడపగడపకు'

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సంక్షేమ సమతుల్యానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 2వ వార్డు కృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి అందిస్తున్న నవరత్నాల సంక్షేమ ఫలాలు ఏయే స్థాయిలో అందుతున్నాయో అంశంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి దిశగా పయనిస్తున్నామని అన్నారు. పాలనా వికేంద్రీకరణతో రాష్ట్ర దశ, దిశలను మార్చే బృహత్తర యజ్ఞానికి చేస్తున్న ప్రయత్నానికి ముఖ్యమంత్రితో ప్రజలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ, ఆమదాలవలస నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ఇందుకూరి రఘురామరాజు, కమిషనరు ఎం.రవిసుధాకర్, ఎఇ కె.అప్పలనాయుడు, హౌసింగ్, విద్యుత్శాఖ, టిడ్కో ఎఇలు డి.సన్యాసిరావు, జి.రామారావు, ఎం.రమేష్, సివిల్ సప్లయి డిటి అమర్నాథ్, వైసిపి నాయకులు బి.రమేష్కుమార్, కె.రామకృష్ణ, దుంపల శ్యామలరావు, మామిడి రమేష్, ఎన్.చిన్నారావు, బి.వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.



మెళియాపుట్టి : పోస్టర్ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

కంచిలి: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని జెడ్పి చైర్పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బొగాబెని పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ఘనత జగన్మోహన్రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వర్రెడ్డి, ఎంపిపి పైల దేవదాస్రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు గుమ్మడి రాందాస్, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, సర్పంచ్ గొనప సింహాచలం, ఎంపిటిసి బి.వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మెళియాపుట్టి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సోమవార ం సిరియాకండి గ్రామ సచివాలయం పరిధిలో కూర్మన్నపేట, దారిపేట, కొత్తపేట, చింతపల్లి గిరిజన గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, పల్లి యోగి, సర్పంచ్లు జనపరెడ్డి కన్నబాబు, ఎస్.భాస్కరరావు, ఎ.రాజశేఖర్రెడ్డి, లింగాల సంజీవరావు, బి.తేజరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు

టెక్కలి రూరల్ : లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం-4 చేరివీధి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ లబ్ధిదారులకు లబ్ధిపొందిన పత్రాలను అందజేశారు. రిక్షా కార్మికుడు గాయపడటంతో తన వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో తీసుకెళ్లి, వైద్యం అందించారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజినమ్మ, మేజరు పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, ఉప సర్పంచ్ గండి విశ్వశాంతి అప్పలరెడ్డి, ఎంపిటిసి పీత హేమలత, బగాది హరి, ఎన్.శంకర్, సాబతో, మొర్రి శంకరరావు, సర్పంచ్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇది భారాల ప్రభుత్వం

ఇచ్ఛాపురం : వైసిపి భారాలు మోపే ప్రభుత్వమని, ఈ ప్రభుత్వ పాలనలో ఏ ఒక్కరికీ సుఖం లేదని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. సోమవారం బెల్లుపడలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. 12, 13 వార్డుల్లో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలపై పన్ను రూపంలో భారం పడుతోందన్నారు. ఇచ్చింది గోరంత.. తీసుకున్నది కొండంతలా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, రెయ్యి జానకిరావు, కొండ శంకర్రెడ్డి, ఆసి లీలారాణి, నందిగాం కోటేశ్వరరావు, పత్రి తవిటయ్య, కాళ్ల జయదేవ్, కాళ్ల దిలీప్, శేఖర్, నారాయణ బెహరా పండా, సంతోష్, దక్కత ఢిల్లీరావు, సహదేవ్రెడ్డి, విశ్వనాథ, తదితరులు పాల్గొన్నారు.



మందస : మాట్లాడుతున్న గౌతు శిరీష

టెక్కలి: వైసిపి పాలనలో రాష్ట్రానికి ఖర్మ పట్టిందని, ఈ ఖర్మ మనకొద్దని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు పిలుపునిచ్చారు. మండలంలోని బూరగాంలో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ బెహరా, పురుషోత్తం, షణ్ముఖరావు, ఎం.రాము, ప్రతీష్చంద్, దల్లి ప్రసాద్రెడ్డి, మధు, కామేష్, తదితరులు పాల్గొన్నారు.

మందస : రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉన్న ఏకైక పార్టీ టిడిపి అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస మండలం నర్సింగపురం పంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొని రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనతో గ్రామీణ ప్రాంత ప్రజలు విసుగు చెందుతున్నారన్నారు. ఒక వైపు ధరలు విపరీతంగా పెరుగుతుంటే మరోవైపు ఉద్యోగ అవకాశాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జి.కె.నాయుడు, దుర్యోధన, దాసరి తాతారావు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : సమస్యలను రాసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

మృతుడు కుటుంబానికి పరామర్శ

వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరుకు చెందిన టిడిపి నాయకులు లండ నారాయణ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఆమె పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఎంఇడిలకు ఉపాధి కల్పించాలి

జలుమూరు: ఏళ్ల తరబడి ఎందరో ఉపాధ్యాయులను తీర్చిదిద్దిన ఎంఇడిలు నేడు ఉపాధి లేక రోడ్డున పడ్డారని, ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించాలని శ్రీకాకుళం జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతాడ వెంకటరమణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అర్హతలూ కలిగి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 వేలమంది నిరుద్యోగులు ప్రైవేటు డిఇడి, బిఇడి కాలేజీల్లో వేల మంది ఉపాధ్యాయులను తీర్చిదిద్దారని, వారు నేడు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 1988 నాటి నుంచి ఎంఇడి అర్హత ఉన్నా ఉపాధి అవకాశాలు లేక వయస్సు దాటిపోయిందన్నారు. ఎంఇడి చేసిన పట్టభద్రులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. విద్యారంగంలోని ఎంఇఒ, డైట్ లెక్చరర్స్, యూనివర్సిటీ నియామకాల్లో ఎంఇడి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇప్పటికే అర్హత వయస్సు పరిమితి మించిపోవడంతో ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీసం ఒప్పంద, పొరుగుసేవల పద్ధతిలోనైన తమకు ఉపాధి కల్పించాలని వారు కోరారు. సమావేశంలో ఆ సంఘం సభ్యులు అల్లు షణ్ముఖరావు, హనుమంతు. విజకుమార్, దుబా సురేషకుమార్, పొన్నాడ వెంకట రామ్మోహన్రావు, టి.అశోక్కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు వెంకటరమణమూర్తి

రేషన్ బియ్యం పట్టివేత

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్రలో అక్రమంగా తరలిస్తున్న 1150 కేజీల రేషన్ బియ్యాన్ని సంతబొమ్మాళి-2 పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ బియ్యం బోరుభద్రకు చెందిన గుడ్ల వైకుంఠరావు చెందినవిగా గుర్తించారు. వీరికి కోటబొమ్మాళి మండలం నిమ్మాడ కూడలి సమీపంలో విజయలక్ష్మి రైస్ మిల్లు ఉంది. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసేందుకు వారికి చెందిన వ్యాన్లో బియ్యం రైస్ మిల్లుకు తరలిస్తుండగా బోరుభద్ర శివారులో పట్టుకొని పట్టుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఎస్ఐ మధుసూదనరావు వివరణ కోరగా, అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించామని తెలిపారు. డీటి ప్రవీన్, సివిల్ సప్లయి డిటి రాము, ఆర్ఐ చంద్రమౌళి విచారణ చేపట్టారు.



జ్ఞాపికను అందజేస్తున్న ఇఒ హరిసూర్యప్రకాష్

ఆదిత్యుని సన్నిధిలో 'నాదెండ్ల'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, జనసేన పార్టీ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సోమవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారికి పలు సేవలు నిర్వహించిన అనంతరం అనివేటి మండపంలో ఆయనకు శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు.



మాట్లాడుతున్న ఎంపిపి ప్రతినిధి బైరాగినాయుడు

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని సచివాలయ ఉద్యోగులు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని పని చేయాలని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు సూచించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బైరాగినాయుడు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు గ్రామ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, తమ సేవలు అందించి, మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు. 2023-24లో గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసేటప్పుడు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఉపాధి ప్రణాళికలో ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించి ఆమోదించాలని కోరారు. సర్పంచ్లు, ఎంపిటిసిలు, అధికారులు ఈ మూడు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప ఎంపిపి కోట అప్పారావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బలగ సూర్య ప్రకాష్రావు, పశువైద్య అధికారి అనిల్, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పాలవలస గ్రామ సచివాలయాన్ని స్థానిక ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అంతకుముందు గ్రామంలోని నక్కల వీధిలో ఎంపిపి నిధులు రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపితో పాటు సర్పంచ్ హేమలత, ఎంపిటిసి రూపవతి, నాయకులు ఢిల్లీ, శంకర్, కె.శ్రీను, వెంకటరావు, దొంబూరు, కామోజీ, ఈశ్వరరావు, షణ్ముఖరావు, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కోటపాలెంలో సంక్రాంతి పండగకు నిర్వహించనున్న భద్రమహంకాళి అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్కుమార్ పిలుపునిచ్చారు. ఆలయం ఆవరణలో సోమవారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్పిటిసి టొంపల సీతారాం, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, నాయకులు మహంతి పెద్దరామునాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, పైడిభీమవరం, పిఎసిఎస్ చైర్మన్ గొర్లె తిరుపతినాయుడు, కోటపాలెం, పాతర్లపల్లి, జీరుపాలెం, జె.ఆర్.పురం సర్పంచ్లు గొర్లె జగదీష్, గొర్లె రాధాకృష్ణ, బస్వ దురుగుబాబు, రాముడు, భవిరి రమణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

కంచిలి: ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో మండలంలోని మకరాంపురం, అంపురం పరిసర గ్రామాల్లో సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకొని మహిళా పోలీసులతో కలిసి ప్రచారం చేపట్టారు. అవగాహనతోనే ప్రమాదాలను నివారించొచ్చని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: బారువ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం బారువ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీసులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను నివారించాలంటే అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పొందూరు: మండలంలోని కింతలి, తాడివలస విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్శాఖ ఇఇ ఎస్.భయ్యన్నాయుడు, ఎడి యు.వి.రమణమూర్తి, ఎఇ దుర్గాప్రసాద్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని వారు కోరారు.

లావేరు : మండలవ్యాప్తంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ టి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి లైన్ మెంటినెన్స్ కోసం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుడుమూరు, లావేరు, అదపాక, కేశవరాయునిపాలెం గ్రామాల్లోని విద్యుత్ ఉప కేంద్రాలు పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆత్మీయ కలయిక

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆత్మీయ కలయిక శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు తోటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సింహాద్రి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి తామాడ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు గాడి గణపతి, ఆచారి దాకోజు వెంకటరావు, కోశాధికారి శాసనపురి జగదీశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మంతెన వాసుదేవాచారి, కార్యనిర్వహణ కార్యదర్శి అనుపోజు కోదండ రామకృష్ణ, మహిళా కన్వీనర్ పెరుమాళ్ల వసంతలక్ష్మి పాల్గొన్నారు.

అచ్చంపేటలో ప్రభుత్వ స్థలం ఆక్రమణ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో సుమారు రూ.50 లక్షలు విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని అచ్చంపేట యువకులు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రీవెన్స్లో ఫిర్యాదు చేశారు. 12వ వార్డు అచ్చంపేటలో సర్వే నెంబరు 130లో పార్కు నిర్మాణం కోసం ఆ స్థలం ఉంచారని తెలిపారు. ప్లాన్ అప్రూవల్ అయిందని, ఇంతలో ఆక్రమణకు గురైనా అదికారులు పట్టించుకోలేదని వాపోయారు.

రాజీనామాకు శానిటేషన్ సూపర్వైజర్లు సిద్ధం

- చైర్మన్ వద్ద పంచాయితీ
- చెప్పిన పని చేయాల్సిందే : కమిషనర్



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సచివాలయాల్లో పని చేస్తున్న శానిటేషన్ సూపర్వైజర్లు మూకుమ్మడిగా రాజీనామాకు సిద్ధమయ్యారు. మున్సిపల్ కమిషనర్ తమపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆయన బారి నుంచి తమను కాపాడాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు వద్ద పంచాయతీ పెట్టారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబును శానిటేషన్ సూపర్వైజర్లు కలిసి, కమిషనర్పై ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 16 సచివాలయాలు ఉండగా అందులో 13 మంది శానిటేషన్ సూపర్వైజర్లు ఉన్నారని తెలిపారు. వారంతా వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య సిబ్బందితో పని చేయాల్సి ఉందని చెప్పారు. మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బంది తగినంతగా లేరని, దీనికి తోడు సచివాలయ వ్యవస్థ ఏర్పడిందని అన్నారు. తమ విధులతో పాటు, అదనపు బాధ్యతలు అప్పగించడం తలకు మించిన భారంగా మారిందని వాపోయారు. తమ పరిధిలో ఉన్న ఒకరిద్దరు కార్మికులతో పని చేయలేమని తెలిపారు. మా కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో ఇటు కుటుంబ బాధ్యతలు, అటు విధులు చేయలేకపోతున్నామని చెప్పారు. ఇటీవల ఓ శానిటేషన్ సూపర్వైజర్ మనస్థాపంతో ఆత్మహత్యకు సిద్ధమవ్వగా నచ్చజెప్పామని తెలిపారు.

కమిషనర్ ముందే చైర్మన్కు వారు వినతిపత్రం అందజేశారు. తాము విద్యావంతులమని, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించడంతో ఈ వృత్తిలోకి వచ్చామని, ఇంతటి అవమానాలు ఎదుర్కొంటున్నామని కలలో కూడా అనుకోలేదని వాపోయారు. కొందరు మహిళలతో డంపింగ్ యార్డులో పని చేయిస్తున్నారని తెలిపారు.

వికేంద్రీకరణతో సమగ్రాభివృద్ధి


ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వికేంద్రీకరణతో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని మున్సిపల్ వైస్ చైర్పర్సన్ భారతీ దివ్య అన్నారు.. వార్డులో జరిగిన మహిళా సంఘాల సమావేశంలో వైస్ చైర్పర్సన్ ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రాజధానులతో రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం లైంగిక దాడులు, వేధింపుల నుంచి రక్షణ పొందడంపై అవగాహన కల్పించారు. బాలల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, అర్పిలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న భారతీ దివ్య

గ్రామ పంచాయతీ ప్రణాళికపై శిక్షణ



కోటబొమ్మాళి: మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

ప్రజాశక్తి- కవిటి

అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ సూచించారు. గ్రామ పంచాయతీలు- అభివృద్ధి ప్రణాళికలు అనే అంశంపై సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ ప్రజా స్వామ్యానికి పట్టుకొమ్మలైన పంచాయతీల అభివృద్ధి నాయకులు, అధికారులు సమన్వయం తోనే సాధ్యమని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న విలువైన విషయాలను క్షేత్రస్థాయిలో అమలుచేసి పంచాయతీల అభివృద్ధికి కషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పైలా సూర్యనారాయణరెడ్డి, ఇఒపిఆర్డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఎం గోవింద్, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రణాళిక తయారీపై మండల స్థాయి శిక్షణను ఎంపిపి రాణా ఈశ్వరమ్మ సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణ రెండు రోజుల పాటు జరుగుతుందని, దీన్ని సద్వినియోగించుకోవాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి తారకేశ్వరి, సర్పంచ్లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు 2030 నాటికి ఎటువంటి సామాజిక అసమానతలు, విద్య, వైద్యం, తదితర రంగాల్లో సమగ్రమైన అభివృద్ధి సాధించడానికి ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మంద లోకనాథం, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పంచాయతీల అభివృద్ధికి చక్కని ప్రణాళికలు అవసరమని పలువురు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జిపిడిపిపై నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణను ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్కుమార్ ప్రారంభించారు. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిపి వంక రాజు, సర్పంచ్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నేటి నుంచి జిపిడిపిపై శిక్షణ

పొందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమం ప్రణాళిక 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్లకు, ఎంపిటిసిలకు, మండలస్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి విడతల వారీగా ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 13న కనిమెట్ట, కింతలి, మొదలవలస, అచ్చిపోలవలస, తోలాపి, ధర్మపురం, దల్లవలస, కోటిపల్లి పంచాయతీలకుఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

జి.సిగడాం : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13 నుంచి పంచాయతీ అభివద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఇన్ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి, సర్పంచ్లు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొవాలని సూచించారు.

లావేరు : మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్లకు, ఎంపిటిసిలకు, సచివాలయ సిబ్బంది ఈ నెల 13 నుంచి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఇన్ఛార్జి ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ప్రణాళిక రూపొందించేందుకు ఈ శిక్షణలు ఇస్తున్నామని పేర్కొన్నారు. సకాలంలో అందరూ హాజరుకావాలని కోరారు.